
సాక్షి కాకినాడ

గురువారం | 18 | జూలై | 2024



కావుకేకతో కాక పుట్టించి..!

చికెన్ ముక్కలు ఎత్తుకుపోతున్న ఓ కాకిని దుకాణ యజమాని బంధించగా.. దానిని 'కాకి గోల'తో వందలాది కాకులు విడిపించిన ఘటన తాటిపాకలో చోటు చేసుకుంది. - 8లో



శ్రావణంలో శుభయోగం..!

వరుసగా గురు, శుక్ర మౌఢ్యాలు.. దీనికి తోడు ఆషాఢ మాసం రావడంతో ఇటుక విక్రయాలు లేక వ్యాపారులు లబోదిబోమంటున్నారు. శ్రావణ మాసం కోసం ఎదురు చూస్తున్నారు. - 8లో

సముద్రంలోకి 93 వేల క్యూసెక్కులు



ధవళేశ్వరం: కాటన్ బ్యారేజీ నుంచి బుధవారం సాయంత్రం 93,244 క్యూసెక్కుల మిగులు జలాలను సముద్రంలోకి విడిచి పెట్టారు. తూర్పు డెల్టాకు 3,000, సెంట్రల్ 1,700, పశ్చిమ డెల్టాకు 4,000 క్యూసెక్కులు కలిపి డెల్టాలకు మొత్తం 8,700 క్యూసెక్కులు విడుదల చేశారు.

న్యూస్‌రీల్

జిల్లా స్థాయి అధికారులకు నేటి నుంచి శిక్షణ

సామర్లకోట: సుస్థిర అభివృద్ధి అంశాలపై జిల్లా స్థాయి అధికారులకు గురువారం నుంచి ఈ నెల 27వ తేదీ వరకూ స్థానిక విస్తరణ శిక్షణ కేంద్రంలో శిక్షణ ఇవ్వనున్నట్లు మేనేజర్ పి.శ్రీనివాస్ బుధవారం విలేకర్లకు తెలిపారు. శ్రీకాకుళం, విజయనగరం, విశాఖపట్నం, అనకాపల్లి, అల్లూరి సీతారామరాజు, పార్వతీపురం మన్యం, కాకినాడ, తూర్పు గోదావరి, డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ, పశ్చిమ గోదావరి, ఏలూరు జిల్లాల్లోని అన్ని శాఖలకు చెందిన 300 మంది ఉన్నతాధికారులకు శిక్షణ ఉంటుందని వివరించారు. జిల్లా పరిషత్, డీఆర్‌డీఏ, జిల్లా పంచాయతీ, సాంఘిక సంక్షేమం, విద్యా శాఖ, డ్వామాల్లో పరిపాలనాధికారులకు, ఐసీడీఎస్ సీడీపీఓలకు, వైద్య, ఆరోగ్య శాఖలో వైద్యాధికారులకు శిక్షణ ఇస్తామన్నారు. బ్యాచ్‌కు 100 మంది చొప్పున శిక్షణ ఉంటుందన్నారు. గురువారం నుంచి 20వ తేదీ వరకూ ఒక బ్యాచ్, 22 నుంచి 24 వరకూ రెండు, 25 నుంచి 27 వరకూ మూడు బ్యాచ్‌లకు శిక్షణ ఉంటుందని తెలిపారు.

వేణుగోపాలస్వామికి బంగారు హారం



అర్చకుడికి బంగారు హారం అందిస్తున్న దాతలు

పిఠాపురం: స్థానిక రుక్మిణీ సత్యభామ సమేత వేణుగోపాలస్వామి వారికి కుసుమంచి వెంకట రామ్మూర్తి, గుణరత్నం దంపతులు, వారి కుమారులు, కోడళ్లు కామేశ్వరరావు, రత్నమాధవి, వీర్రాజు, లలిత (పిఠాపురం) బుధవారం సుమారు రూ.లక్ష విలువైన బంగారు హారం సమర్పించారు. దీనికి బంగారు శంఖుచక్రాల లాకెట్ కూడా తయారు చేయించారు. ఈ ఆభరణాన్ని వారు అర్చకుడు విజయజనార్దనాచార్యులుకు అందజేశారు. ప్రత్యేక పూజల అనంతరం దీనిని స్వామి వారికి అలంకరించారు. కార్యక్రమంలో ఈఓ నున్న శ్రీరాములు, దేవస్థానం సిబ్బంది పాల్గొన్నారు.

20న ఏఐకేఎంఎస్ రాష్ట్ర కౌన్సిల్ సమావేశాలు

ప్రకాశం నగర్ (రాజమహేంద్రవరం): అఖిల భారత రైతు కూలీ సంఘం (ఏఐకేఎంఎస్) రాష్ట్ర జనరల్ కౌన్సిల్ సమావేశాలు శనివారం రాజమహేంద్రవరంలో జరుగుతున్నాయని అధ్యక్షురాలు తాన్యా తెలిపారు. ఈ సమావేశాలను జయప్రదం చేయాలని ఆమె పిలుపునిచ్చారు. స్థానిక మావో భవన్‌లో బుధవారం జరిగిన సమావేశంలో కౌన్సిల్ పోస్టర్లను నాయకులు విడుదల చేశారు. ఈ సందర్భంగా తాన్యా మాట్లాడుతూ, రాష్ట్రవ్యాప్తంగా రైతు కూలీలు, ఆదివాసీలు, దళితులు, పేదల సమస్యలపై సంఘం నిరంతరం పోరాడుతుందని తెలిపారు. కేంద్రంలో మూడోసారి అధికారంలోకి వచ్చిన మోదీ ప్రభుత్వం సామ్రాజ్యవాదులకు, బహుళ జాతి కంపెనీలకు మరింత ఊడిగం చేస్తోందని విమర్శించారు.

చేయూత ఇస్తారా!



- రూ.18,750 సాయం కోసం మహిళల నిరీక్షణ
- నాలుగేళ్ల పాటు అందించిన వైఎస్సార్ సీపీ ప్రభుత్వం
- నాలుగో విడతలో 1,01,759 మంది లబ్ధిదారులు
- వైఎస్సార్ సీపీ హయాంలో వారికి రూ.190.70 కోట్ల విడుదల
- ఎన్నికల వేళ మోకాలడ్డిన కూటమి నాయకులు
- ఈసీ ఆదేశాలతో 50 శాతం పైగా ఆడపడుచులకు అందని లబ్ధి

కాకినాడ సిటీ: అర్హుల జాబితా ఎప్పుడో సిద్ధమైంది. కావాల్సిన నగదు ఎన్నికల ముందే విడుదలైపోయింది. కానీ వైఎస్సార్ చేయూత పథకం లబ్ధిదారులకు ఇంతవరకూ న్యాయం జరగలేదు. 'చేయూత' సాయం కోసం జిల్లాలో లబ్ధిదారులైన మహిళలు ఆశగా ఎదురు చూస్తున్నారు. కొత్త ప్రభుత్వం దీని ఊసెత్తకపోవడంతో వారు నిరాశ చెందుతున్నారు.

నాలుగేళ్లుగా వైఎస్సార్ చేయూత లబ్ధిదారులు, లబ్ధి (రూ.కోట్లలో)

సంవత్సరం	లబ్ధిదారులు	లబ్ధి
2020-21	87,506	164.10
2021-22	97,326	182.49
2022-23	1,03,576	194.20
2023-24	1,01,759	190.80

(నాలుగో విడతలో కొంత మందికి లబ్ధి చేకూరింది. ఈలోగా ఎన్నికలు రావడం, అనంతరం టీడీపీ – జనసేన – బీజేపీ కూటమి ప్రభుత్వం ఏర్పడటంతో మిగిలిన వారికి అందలేదు.)



వైఎస్సార్ సీపీ హయాంలో 'చేయూత' ఇచ్చారిలా..

ప్రజాసంకల్ప పాదయాత్రలో మహిళల కష్టాలను స్వయంగా తెలుసుకున్న వైఎస్సార్ సీపీ అధినేత వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి 2019 ఎన్నికల్లో ముఖ్యమంత్రిగా బాధ్యతలు చేపట్టిన అనంతరం వైఎస్సార్ చేయూత పథకానికి రూపకల్పన చేశారు. దీని ద్వారా 45 నుంచి 60 సంవత్సరాల మధ్య వయస్సు ఉన్న మహిళలకు అర్హులైన మహిళలకు పశువుల పెంపకం, పాల సేకరణ, కిరాణా షాపులు, వస్త్ర దుకాణాలు ఏర్పాటు చేసుకునేందుకు, పండ్లు, కూరగాయలు, చిన్న జీవాల కొనుగోలు వంటి వాటికి ఏటా రూ.18,750 చొప్పున ఆర్థిక సాయం అందజేశారు. జీవనోపాధి వృద్ధి చేసుకునేందుకు అవసరమైన వ్యాపారాలను నిర్వహించే విధంగా మహిళలకు గత ప్రభుత్వం తోడ్పాటునిచ్చింది. లబ్ధిదారులైన మహిళలు ఈ పథకం ద్వారా పాడి పరిశ్రమతో పాటు రిటైల్ రంగాల్లో జీవనోపాధి అభివృద్ధి చేసుకుంటూ కుటుంబ ఆదాయాలు పెంచుకుంటున్నారు. ఈ మహిళలకు వెన్నుదన్నుగా నిలిచేందుకు అప్పట్లో వైఎస్సార్ సీపీ ప్రభుత్వం రిటైల్ వస్త్ర వ్యాపార రంగంలో గుర్తింపు పొందిన బహుళజాతి కంపెనీలతో ఒప్పందం కూడా కుదుర్చుకుంది. మహిళలకు ఇచ్చిన మాట ప్రకారం వరుసగా మూడేళ్లు ఈ పథకాన్ని నిర్విఘ్నంగా అమలు చేశారు. ముందుగానే ప్రకటించిన క్యాలెండర్ ప్రకారం.. ఎవ్వరికీ నయాపైసా లంచం ఇవ్వనవసరం లేకుండానే అర్హులైన మహిళల బ్యాంకు ఖాతాల్లో నాటి సీఎం వైఎస్ జగన్ నగదు జమ చేసేవారు. జిల్లావ్యాప్తంగా మొదటి మూడు విడతల్లో ఈ పథకం ద్వారా రూ.540.79 కోట్ల మేర ఆర్థిక సహాయం అందించారు. 2023–24కు సంబంధించి కూడా సీఎం జగన్ ఈ పథకానికి పూర్తి స్థాయిలో నిధులు కేటాయించి, ఎన్నికల షెడ్యూల్ ప్రకటనకు ముందే మార్చి 7న విడుదల చేశారు. దీని ప్రకారం జిల్లాలోని 1,01,759 మంది మహిళల బ్యాంకు ఖాతాల్లో దశల వారీగా నగదు జమ ప్రారంభమైంది. వీరికి మొత్తం రూ.190.80 కోట్ల మేర లబ్ధి అందాల్సి ఉంది. అంతలోనే మార్చి 16న ఎన్నికల షెడ్యూల్ విడుదలైంది. ఆ సమయానికే 50 శాతం మహిళల బ్యాంకు ఖాతాల్లో డబ్బు జమ అయ్యింది.

కూటమి కుట్రలతో..

వైఎస్సార్ సీపీ ప్రభుత్వం మహిళలకు లబ్ధి చేకూర్చడంతో టీడీపీ – జనసేన – బీజేపీ కూటమి నాయకులకు కన్ను కుట్టింది. వాస్తవానికి అప్పటికే అమలులో ఉన్న పథకమే కావడంతో ఎన్నికల నిబంధనల ప్రకారం వైఎస్సార్ చేయూత పథకం అమలును నిలుపు చేయడానికి వీలులేదు. అయినప్పటికీ కూటమి నాయకులు కుట్రలు పన్ని, ఎన్నికల కమిషన్‌కు ఫిర్యాదు చేసి, ఒత్తిళ్లు తెచ్చి నిధుల విడుదలకు మధ్యలోనే మోకాలడ్డారు. మహిళలకు ఈ ఆర్థిక సాయం అందకుండా అడ్డుకున్నారు. దీంతో మిగిలిన 60 శాతం మంది మహిళలకు ఈ లబ్ధి అందలేదు. ఎన్నికల అనంతరం ఈ పథకం నగదు తమ ఖాతాలకు జమవుతుందని లబ్ధిదారులైన మహిళలు ఆశించారు. కానీ వారి ఆశలపై కొత్త ప్రభుత్వం నీళ్లు జల్లింది. చేయూత నగదు అందించే అంశంపై ఇప్పటి వరకూ ఎటువంటి ప్రకటనా చేయలేదు. దీనిపై అధికారుల వద్ద కూడా ఎటువంటి సమాచారం లేకపోవడంతో లబ్ధిదారులు ఆందోళన చెందుతున్నారు.

50 శాతం మందికి జమ



"ఇప్పటికే సుమారు 50 శాతం మహిళా లబ్ధిదారుల వ్యక్తిగత బ్యాంకు ఖాతాల్లో వైఎస్సార్ చేయూత పథకం లబ్ధి జమ చేశారు. మిగిలిన వారికి కూడా ఎన్నికల అనంతరం డబ్బులు వేశారు. డబ్బులు బ్యాంకులకు పంపాం. ఈ మొత్తం ఇంకా ఎంత మందికి జమ కాలేదనే వివరాలు తెలియాల్సి ఉంది."

– కె.శ్రీరమణి, డీఆర్‌డీఏ ప్రాజెక్టు డైరెక్టర్, కాకినాడ

వైఎస్సార్ చేయూత ఆర్థిక తోడ్పాటుతో జీవనోపాధులు వృద్ధి చేసుకున్న వారి వివరాలు

జీవనోపాధి	రాణిస్తున్న మహిళలు
రిటైల్ వ్యాపారాలు	3,388
వస్త్ర వ్యాపారం	1,245
డెయిరీ	16,593
గొర్రెలు, మేకల పెంపకం	4,240
పెరటి కోళ్ల పెంపకం	519
ఆహార ఉత్పత్తులు	133
వ్యవసాయ ఉత్పత్తులు	2,392
ఇతర వృత్తుల్లో రాణిస్తున్న వారు	1,216
మొత్తం	28,949

శాంతిభద్రతల పరిరక్షణే ధ్యేయం



జిల్లా ఎస్పీగా బాధ్యతలు చేపడుతున్న విక్రాంత్ పాటిల్

కాకినాడ క్రైం: జిల్లా ఎస్పీగా విక్రాంత్ పాటిల్ బుధవారం బాధ్యతలు చేపట్టారు. ఈ సందర్భంగా వేద పండితుల ఆశీర్వాదం పొందారు. పలువురు పోలీసు అధికారులు నూతన ఎస్పీకి అభినందనలు తెలిపారు. అనంతరం ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. శాంతిభద్రతల పరంగా జిల్లా సున్నితమైన ప్రాంతమని, ఇక్కడి ప్రజల్లో రాజకీయ చైతన్యం అధికమని అన్నారు. మహిళలు, అణగారిన వర్గాల భద్రతే లక్ష్యంగా శాంతిభద్రతల పరిరక్షణకు పాటుపడతానని చెప్పారు. పోలీసు స్పందన సహా ఇప్పటికే జిల్లా పోలీసు శాఖ ఆధ్వర్యాన కొనసాగుతున్న వివిధ కార్యక్రమాలు నిరాటకంగా, మరింత సమర్థంగా నిర్వహిస్తామని అన్నారు. కార్యక్రమంలో అదనపు ఎస్పీ భాస్కరరావు, డీఎస్పీలు, ఇతర పోలీసు అధికారులు పాల్గొన్నారు.

111 మంది ఎస్సైల బదిలీ

ఏలూరు టౌన్: ఏలూరు రేంజ్ పరిధిలోని ఏడు జిల్లాల్లో పని చేసేందుకు సుమారు 111 మంది ప్రమోటీ ఎస్సైలను బదిలీ చేస్తూ ఐజీ జీవీజీ అశోక్ కుమార్ ఉత్తర్వులు జారీ చేశారు. విజయవాడ పోలీస్ కమిషనరేట్‌కు 27 మంది, కృష్ణా జిల్లాకు 23 మంది, ఏలూరు జిల్లాకు 12 మంది, పశ్చిమ గోదావరికి 14 మంది, తూర్పు గోదావరికి 13 మంది, డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమకు 9 మంది, కాకినాడకు ఏడుగురు, అల్లూరి సీతారామరాజు జిల్లాకు ఆరుగురిని బదిలీ చేశారు.

నిండు శోకంతో మొహర్రం

- రక్తం చిందిస్తూ.. నివాళులు
- గుమ్మటాలు, పీర్ల ఊరేగింపు



నగరం గ్రామ వీధుల్లో పీర్లు, గుమ్మటాల ఊరేగింపు

మామిడికుదురు: ముస్లింల ఆరాధ్య దైవం హజరత్ ఇమామ్ హుస్సేన్, అతని పరివారం ఇరాక్‌లోని కర్బలా పుణ్యభూమిలో అమరత్వం పొందిన రోజు (షహదత్) సందర్భంగా మొహర్రంను బుధవారం నిండు శోకంతో నిర్వహించారు. దీనిలో భాగంగా కత్తులు, బ్లేళ్లు, గొలుసులతో ముస్లింలు తమ శరీరాలను గాయపర్చుకుని రక్తం చిందిస్తూ ఇమామ్ హుస్సేన్ అతని పరివారానికి నివాళులర్పించారు. 'హుస్సేన్.. హుస్సేన్'.. అని నినదిస్తూ గుండెలు బాదుకుంటూ మాతం నిర్వహించారు. మామిడికుదురు, నగరం గ్రామాల్లోని సుమారు 40 పంజాల నుంచి పీర్లు, గుమ్మటాలను తీసి పురవీధుల్లో ఊరేగిస్తూ ఇమామ్ హుస్సేన్ అతని పరివారానికి శోకంతో అంజలి ఘటించారు. ఇరాక్‌లోని పవిత్ర కర్బలా పుణ్యభూమిలో జరిగిన యుద్ధ సంఘటనలను మత ప్రబోధకులు సయ్యద్ మహ్మద్ అలీ జాఫరీ భక్తులకు వివరించారు. మామిడికుదురు, నగరం మసీదుల్లో అమరవీరుల పేరిట ప్రత్యేక ప్రార్థనలు జరిగాయి. నగరంలోని మంజిల్–ఎ–కర్బలా వద్ద రక్తం చిందిస్తూ మాతం నిర్వహించారు. పెద పంజీషాలో షహదత్ మజ్లిస్ ఆలపించారు. ఇమామ్ హుస్సేన్, అతని పరివారం అమరత్వం పొందిన ఘటనలను మజ్లిస్ రూపంలో వివరించారు. అది విని హుస్సేన్ అతని పరివారం ప్రాణ త్యాగాలను స్మరిస్తూ ముస్లింలు తీవ్రంగా విలపించారు. నగరంలోని చెరువులో పీర్లను శాంతింప చేశారు. రాష్ట్రంలోని వివిధ ప్రాంతాల నుంచి భారీగా తరలి వచ్చిన ముస్లింలు నలుపు రంగు దుస్తులు ధరించి మొహర్రం సంతాప కార్యక్రమాల్లో పాల్గొన్నారు. నగరంలోని అంజుమన్–ఎ–హుస్సేనీ సంఘం ఆధ్వర్యంలో భక్తులకు ఏర్పాట్లు చేశారు.

27న రాష్ట్ర స్థాయి ఎస్సీ, ఎస్టీ వర్క్‌షాప్

కాకినాడ సిటీ: రాజ్యాంగం కల్పించిన ప్రాథమిక హక్కులు, ఆదేశ సూత్రాలు, ప్రాథమిక విధులపై అవగాహన కల్పించేందుకు ఈ నెల 27న కాకినాడ డి–కన్వెన్షన్ హాలులో 17వ రాష్ట్ర స్థాయి ఎస్సీ, ఎస్టీ వర్క్‌షాపు నిర్వహిస్తున్నారు. అంబేడ్కర్ ఆలోచన ఫౌండేషన్ వ్యవస్థాపకుడు, న్యాయవాది పినిపే వెంకట రామకృష్ణ ఈ విషయం తెలిపారు. కలెక్టరేట్ సమీపంలోని డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విగ్రహానికి ఆయన బుధవారం పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం మీడియాతో మాట్లాడుతూ, స్వాతంత్ర్యం సిద్ధించి వందేళ్లకు చేరువవుతున్నా అంబేడ్కర్ అందించిన రాజ్యాంగ ఫలాలను దళిత, గిరిజన ప్రజలు పూర్తి స్థాయిలో అందుకోలేకపోతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ వర్క్‌షాప్‌నకు రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న విశ్రాంత న్యాయమూర్తులు, న్యాయవాదులు, విశ్రాంత వైద్య నిపుణులు, సమాజం పట్ల అవగాహన కలిగి, మార్పు కోసం తపించే వివిధ రంగాల వారు హాజరవుతారని రామకృష్ణ తెలిపారు. ఈ సందర్భంగా వర్క్‌షాపు బ్రోచర్లను నాయకులు విడుదల చేశారు.

ట్రాక్టర్ ఢీకొని బాలుడి దుర్మరణం



రోడ్డుప్రమాదంలో మృతి చెందిన కొవ్వూరి రియాన్స్ (ఫైల్)



సంఘటన స్థలాన్ని పరిశీలిస్తున్న ఎస్సై రామకృష్ణ

కరప: మండలంలోని వేళంగి వద్ద బుధవారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో నాలుగేళ్ల బాలుడు దుర్మరణం పాలయ్యాడు. తీవ్రంగా మరో ఇద్దరు తీవ్రంగా గాయపడ్డారు. కరప ఎస్సై టి.రామకృష్ణ కథనం ప్రకారం.. డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా రావులపాలెం సమీపంలోని వెదిరేశ్వరం గ్రామానికి చెందిన కొవ్వూరి సూర్య భాస్కర రెడ్డి, అలేఖ్య దంపతులు కాకినాడ రూరల్ కొవ్వూరులోని వారాహి అమ్మవారిని దర్శనానికి బైక్‌పై వచ్చారు. వీరితో పాటు మేనల్లుడు, సూర్య భాస్కరరెడ్డి కుమారుడు అయిన కొవ్వూరి రియాన్స్(4)ను తీసుకుని, కుమారుడు స్వప్నిత్తో కలసి కత్రి ధనలక్ష్మి కూడా మరో బైక్‌పై వచ్చారు. అమ్మవారి దర్శనానంతరం రెండు ద్విచక్ర వాహనాలపై తిరుగు ప్రయాణమైన వారిని వేళంగి వద్దకు వచ్చేసరికి తాటి దుంగలు, తాటిబద్దల లోడుతో వెళుతున్న ట్రాక్టర్ ఢీకొంది. దీంతో అదుపు తప్పి పడిపోయిన వీరి పైనుంచి ట్రాక్టర్ ట్రాలీ దూసుకుపోయింది. ఈ ప్రమాదంలో సూర్య భాస్కర రెడ్డి కుమారుడు రియాన్స్ అక్కడికక్కడే మృతి చెందాడు. ఆ బాలుడి మృతదేహాన్ని రామచంద్రపురం ఏరియా ఆసుపత్రికి తరలించారు. తీవ్రంగా గాయపడిన ధనలక్ష్మిని, ఆమె కుమారుడు స్వప్నిత్‌లను కాకినాడలోని ఒక ప్రైవేటు ఆసుపత్రికి తరలించారు. ఈ ప్రమాదంపై కరప ఎస్సై టి.రామకృష్ణ కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నారు.

కరుణించు స్వామీ..

- వైభవంగా తొలి ఏకాదశి పర్వదినం
- ఆలయాల్లో భక్తుల కోలాహలం
- ప్రత్యేక పూజలు

సర్వ జగద్రక్షకుడైన శ్రీమహావిష్ణువు యోగనిద్రకు ఉపక్రమించే శుభ తరుణమైన తొలి ఏకాదశి పర్వదినాన్ని బుధవారం పలువురు భక్తిశ్రద్ధలతో జరుపుకొన్నారు. ఉపవాస దీక్ష పాటించి, ఆ స్వామికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లా వ్యాప్తంగా ఆలయాలకు భక్తులు పోటెత్తారు. ఆ జగన్నాథుడిని దర్శించుకుని చల్లని చూపులతో తమను కరుణించాలని వేడుకున్నారు.

అన్నవరం: వేలాదిగా తరలివచ్చిన భక్తులతో రత్నగిరిపై సత్యదేవుని ఆలయం కిటకిటలాడింది. సుమారు 25 వేల మంది భక్తులు స్వామివారిని దర్శించి, పూజలు చేశారు. దీంతో ఆలయ ప్రాంగణం, వ్రత, విశ్రాంతి మండపాలు భక్తులతో నిండిపోయాయి. ఉదయం నుంచే పెద్ద సంఖ్యలో భక్తులు రత్నగిరికి తరలివచ్చారు. సత్యదేవుని దర్శించిన అనంతరం, సప్తగోకులంలో గోవులకు ప్రదక్షిణ చేశారు. రావి చెట్టు వద్ద జ్యోతులు వెలిగించి, ప్రదక్షిణ చేశారు. సుమారు 1,500 వ్రతాలు నిర్వహించారు. అన్ని విభాగాల ద్వారా దేవస్థానానికి రూ.30 లక్షల ఆదాయం సమకూరింది. సుమారు 4 వేల మంది భక్తులు సత్యదేవుని అన్న ప్రసాదం స్వీకరించారు. ఏకాదశి పర్వదినాన్ని పురస్కరించుకుని ప్రధానార్చకుడు కోట సుబ్రహ్మణ్య శర్మ ఆధ్వర్యాన సత్యదేవునికి ఉదయం ఏడు గంటలకు స్వర్ణ పుష్పాలతో అష్టోత్తర పూజ నిర్వహించారు. అనంతరం ఉదయం 9 నుంచి 11 గంటల వరకూ సత్యదేవుడు, అమ్మవారిని తులసి దళాలతో అర్చించారు. స్వామి, అమ్మవారికి ప్రసాదాలు నివేదించిన అనంతరం పండితులు వేదాశీస్సులు అందజేశారు.



సత్యదేవుని దర్శనానికి క్యూలో నిల్చున్న భక్తులు

వాడపల్లికి పోటెత్తిన భక్తులు



ప్రత్యేక అలంకరణలో వాడపల్లి వేంకటేశ్వర స్వామి

ఆత్రేయపురం: కోనసీమ తిరుపతిగా ఖ్యాతికెక్కిన వాడపల్లి శ్రీదేవి, భూదేవి సమేత శ్రీ వేంకటేశ్వర స్వామి ఆలయానికి వేలాదిగా భక్తులు తరలివచ్చారు. ఉదయం 4.30 గంటలకు స్వామి వారి మూలమంత్ర సహిత ఐశ్వర్యలక్ష్మి హోమం, అర్చన నిర్వహించారు. అనంతరం భక్తులను స్వామి వారి దర్శనానికి అనుమతించారు. ఈ సందర్భంగా అష్టోత్తర పూజలు, కల్యాణోత్సవం కన్నుల పండువగా నిర్వహించారు. స్వామివారికి సాయంత్రం గరుడ వాహన సేవ నిర్వహించారు. తొలి ఏకాదశి పర్వదినాన్ని పురస్కరించుకుని స్వామివారిని కన్నుల పండువగా ప్రత్యేకంగా అలంకరించారు. ఏర్పాట్లను దేవదాయ, ధర్మాదాయ శాఖ డిప్యూటీ కమిషనర్, ఆలయ ఈఓ భూపతిరాజు కిశోర్‌కుమార్ ఆధ్వర్యాన సిబ్బంది పర్యవేక్షించారు. మండలంలోని మరో సుప్రసిద్ధ ఆలయం ర్యాలి శ్రీ జగన్మోహినీ కేశవ స్వామి ఆలయానికి కూడా అధిక సంఖ్యలో భక్తులు తరలివచ్చి, స్వామి వారిని దర్శించుకుని, తీర్థ ప్రసాదాలు స్వీకరించారు. ఏర్పాట్లను ఆలయ ఈఓ బి.కృష్ణచైతన్య పర్యవేక్షించారు.



అయినవిల్లి విఘ్నేశ్వరస్వామి ఆలయానికి పోటెత్తిన భక్తులు

అయినవిల్లిలో భక్తజనవాహిని

అయినవిల్లి: గ్రామంలోని విఘ్నేశ్వరస్వామి ఆలయానికి అధిక సంఖ్యలో భక్తులు పోటెత్తారు. స్వామివారికి తెల్లవారుజామున ప్రధానార్చకుల ఆధ్వర్యాన ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించారు. స్వామివారి పంచామృతాభిషేకంలో ఐదుగురు దంపతులు, లక్ష్మీ గణపతి హోమంలో 32 మంది భక్త దంపతులు పాల్గొన్నారు. లఘున్యాస, ఏకాదశ రుద్రాభిషేకాలు 141 మంది చేయించుకున్నారు. స్వామివారి ప్రత్యేక దర్శనం 1,286 మంది చేసుకున్నారు. ఒక చిన్నారికి నామకరణం చేయించారు. ఏడుగురు చిన్నారులకు అక్షరాభ్యాసం, పది మందికి అన్నప్రాశన, 15 మంది చిన్నారులకు తులాభారం నిర్వహించారు. ఎనిమిది మంది భక్తులు తలనీలాలు సమర్పించారు. నూతన వాహనాలకు 69 మంది పూజలు చేయించుకున్నారు. 6,500 మంది భక్తులు స్వామివారి అన్నప్రసాదం స్వీకరించారు. వివిధ పూజా టికెట్ల విక్రయం, అన్నదాన విరాళాల ద్వారా స్వామివారికి రూ.3,89,837 ఆదాయం సమకూరిందని ఆలయ ఈఓ ముదునూరి సత్యనారాయణరాజు తెలిపారు.



అంతర్వేది ఆలయంలో నారసింహ సుదర్శన హోమంలో పాల్గొన్న భక్తులు

అంతర్వేదిలో..

సఖినేటిపల్లి: అంతర్వేది శ్రీలక్ష్మీనృసింహస్వామి వారిని సుమారు 8 వేల మంది భక్తులు దర్శించుకున్నారని ఆలయ అసిస్టెంట్ కమిషనర్ వి.సత్యనారాయణ తెలిపారు. ఆలయంలో నిర్వహించే నారసింహ సుదర్శన హోమంలో అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు. నిత్యాన్నదాన పథకంలో పలువురు భక్తులు స్వామివారి అన్నప్రసాదం స్వీకరించారు. భక్తులకు ఎటువంటి అసౌకర్యం కలగకుండా దేవస్థానం అన్ని ఏర్పాట్లు చేసింది. పశ్చిమ గోదావరి జిల్లా మొగల్తూరు మండలం కొత్తోట గ్రామానికి చెందిన భక్తులు పాదయాత్రగా అంతర్వేది పుణ్యక్షేత్రానికి తరలి వచ్చి, స్వామివారిని దర్శించుకుని, ప్రత్యేక పూజలు చేశారు.

అప్పనపల్లిలో సందడి



విశేష ఫలాలంకరణతో బాలబాలాజీ స్వామి

మామిడికుదురు: అప్పనపల్లి బాల బాలాజీ స్వామి ఆలయం భక్తులతో కోలాహలంగా మారింది. తొలి ఏకాదశిని పురస్కరించుకుని స్వామిని పలు రకాల ఫలాలతో అందంగా అలంకరించారు. స్వామి వారిని దర్శించుకున్న భక్తులు తన్మయత్వంతో పరవశించారు. గోవిందా.. గోవింద అంటూ భక్తిపారవశ్యంతో నినదించారు. మామిడికుదురు నుంచి 100 మందికి పైగా భక్తులు పాదయాత్రగా అప్పనపల్లి ఆలయానికి తరలివచ్చారు. వీరితో పాటు ఇతర భక్తులు కూడా భారీగా తరలి రావడంతో ఆలయం కోలాహలంగా మారింది. వివిధ సేవల ద్వారా స్వామి వారికి రూ.2,07,066 ఆదాయం వచ్చిందని ఆలయ ఈఓ గ్రంధి మాధవి తెలిపారు. లడ్డూ ప్రసాదం, దర్శనం టికెట్ల విక్రయం ద్వారా రూ.1,54,056 ఆదాయం వచ్చింది. నిత్యాన్నదానానికి భక్తులు రూ.53,010 విరాళాలు సమర్పించారు. 3,581 మంది భక్తులు స్వామి వారిని దర్శించుకోగా 2,649 మంది స్వామివారి అన్నప్రసాదం స్వీకరించారు.

క్లుప్తంగా

కాట్రావులపల్లి నుంచే అత్యధిక కేసులు

డీఎస్పీ లతాకుమారి



సదస్సులో మాట్లాడుతున్న డీఎస్పీ లతా కుమారి

జగ్గంపేట: జగ్గంపేట పోలీసు స్టేషన్‌కు అత్యధిక కేసులు మండలంలోని కాట్రావులపల్లి నుంచే వస్తున్నందువల్ల గ్రామంలో పోలీసు అవుట్ పోస్టు ఏర్పాటు చేస్తున్నట్టు డీఎస్పీ లతాకుమారి తెలిపారు. ఈ అవుట్ పోస్టు ప్రారంభించిన అనంతరం గ్రామస్తులకు అవగాహన సదస్సు ఏర్పాటు చేసి మహిళలకు రక్షణ కల్పించడం తమ ప్రధాన కర్తవ్యమని, గ్రామాల్లో మహిళలకు ఎటువంటి హాని జరగకుండా ఉండేందుకు కృషి చేస్తామని అన్నారు. గ్రామస్తులు సత్ప్రవర్తన కలిగి వుండాలని, అనవసరమైన ఘర్షణలు, వివాదాల జోలికి వెళ్లి కేసులలో ఇరుక్కోవద్దని సూచించారు. అవుట్ పోస్టులో నిత్యం ఇద్దరు స్టాఫ్ ఉంటారని ఏఎస్ఐ, హెడ్ కానిస్టేబుల్ స్థాయి వారిని నియమిస్తామని చెప్పారు. గ్రామంలో తాము అనుకున్న మార్పు వచ్చిన తరువాత అవుట్ పోస్టు ఎత్తేస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో సీఐ లక్ష్మణరావు, ఏఎస్ఐ నూకరాజు, సర్పంచి సుగుణరావు, గ్రామ ప్రముఖులు సుంకర సీతారామయ్య, గ్రామస్తులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో డ్రైవర్ మృతి



మృతి చెందిన డ్రైవర్ నాగేశ్వరరావు

ప్రత్తిపాడు: ప్రత్తిపాడు జాతీయ రహదారిపై జరిగిన రోడ్డు ప్రమాదంలో ఐషర్ వ్యాన్ డ్రైవర్ మృతి చెందిన సంఘటన బుధవారం జరిగింది. స్థానిక పోలీసుల కథనం మేరకు శంఖవరం మండలం వజ్రకూటం నుంచి బొమ్మూరు వెళ్తున్న ఐషర్ వ్యాన్ జాతీయ రహదారిపై శ్రీపాదాలమ్మ అమ్మవారి ఆలయ సమీపంలో అదుపు తప్పి రోడ్డు పక్కనే ఉన్న గుంతలోకి దూసుకుపోయింది. ఈ ఘటనలో బొమ్మూరు గ్రామానికి చెందిన వ్యాన్ డ్రైవర్ గొంతు నాగేశ్వరరావు (49) అక్కడికక్కడే మృతి చెందాడు. తెల్లవారుజాము కావడంతో డ్రైవర్ నిద్ర మత్తులో ఉండడం వల్ల ఈ ప్రమాదం జరిగినట్టు పోలీసులు భావిస్తున్నారు. మృతుడిని శవపరీక్షకై స్థానిక కమ్యూనిటీ హెల్త్ సెంటర్‌కు తరలించారు. ప్రత్తిపాడు ఎస్సై ఎం.పవన్‌కుమార్ కేసు దర్యాప్తు చేస్తున్నారు.

పెన్షనర్ల సంఘం నూతన కార్యవర్గం

ప్రకాశం నగర్ (రాజమహేంద్రవరం): ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రభుత్వ పెన్షనర్ల సంఘం నూతన కార్యవర్గ ఎన్నిక, 49వ వార్షికోత్సవ సభ బుధవారం స్థానిక ధర్మంచర హాలులో జరిగింది. ఈ కార్యక్రమానికి సంఘం రాష్ట్ర అధ్యక్షుడు డి.వెంకటేశ్వరావు ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా సంఘం నూతన అధ్యక్షుడు కేకే సంజీవరావు, సహాధ్యక్షుడిగా కొండపల్లి సుబ్రహ్మణ్యం, ఉపాధ్యక్షులుగా జి.శేషగిరిరావు, అడ్డా వెంకటరాజు, కనకం చంద్రశేఖర్, మట్టపర్తి సత్యనారాయణ, ఎస్.రామారావు కార్యదర్శిగా గెద్దాడ హరిబాబు, సహాయ కార్యదర్శులుగా మూర్తి, ప్రసాద్, సత్యనారాయణ, కోశాధికారిగా రాజుతో పాటు 10 మంది కార్యవర్గ సభ్యులైన నూతన కమిటీతో ప్రమాణస్వీకారం చేయించారు. నూతన అధ్యక్షుడు సంజీవరావు మాట్లాడుతూ సంఘం అధ్యక్షుడిగా ఏకగ్రీవంగా ఎన్నుకొన్న నగర పెన్షనర్ల సంఘ సభ్యులందరికీ ధన్యవాదాలు తెలియజేశారు. పెన్షనర్ల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని తెలిపారు. ఈ కార్యక్రమంలో సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జి.ప్రభుదాస్, రాష్ట్ర ఉపాధ్యక్షుడు మలికార్జున భాను పాల్గొన్నారు.

శ్రావణంలో శుభయోగం..!

- ఆశగా ఎదురుచూస్తున్న ఇటుక వ్యాపారులు
- గురు, శుక్ర మౌఢ్యాలతో పాటు ఆషాఢంలో విక్రయాలు లేక భారీగా పేరుకున్న నిల్వలు
- ఆగస్టు 7 తర్వాతే శుభ ముహూర్తాలు
- ఆ 'మంచి రోజు'ల కోసం ఎదురుచూపులు



అనంతపల్లిలోని బట్టీలలో విక్రయానికి సిద్ధంగా ఉన్న ఇటుకలు

నల్లజర్ల: మన దేశంలో ఏ పని ప్రారంభించాలన్నా శుభ ముహూర్తం చూసుకుని ముందడుగు వేయడం ఆచారంగా వస్తోంది. ఇందుకు మన సంప్రదాయం ప్రకారం ఎటువంటి విఘ్నాలు, మూఢాలు లేకుండా అన్ని విధాలా బాగున్న రోజుల కోసం చాలా వర్గాలు ఎదురు చూస్తుంటాయి. సమాజం సహజంగానే ఒకదానిపై ఒకటి ఆధారపడుతూ జీవనగమనంలో ముందుకు సాగుతుంది. ఈ క్రమంలో కొన్ని వర్గాల జీవనగమనాలు 'మంచిరోజుల'పై ఆధారపడి ఉంటాయి. ప్రస్తుతం ఇటుక బట్టీల వ్యాపారులు, ఉత్పత్తిదారులు శ్రావణమా ఎప్పుడు వస్తావమ్మా అని ఎదురు చూస్తున్నారు.

ఏటా ఆషాఢంలో ఇటుకల విక్రయాలు అంతగా ఉండవు. దీనికి తోడు ఈ ఏడాది గురు, శుక్ర మౌఢ్యములతో పాటు ఆషాఢం కలసి రావడంతో గత ఏప్రిల్ 28 నుంచి విక్రయాలు లేవని ఇటుక బట్టీ యజమానులు లబోదిబోమంటున్నారు. అనంతపల్లి పరిసరాల్లో 50 నుంచి 60 వరకు ఇటుక తీసే బట్టీలున్నాయి. జిల్లా అంతటా ఇక్కడి నుంచే ఇటుక రవాణా జరుగుతుంది. వర్షాలు ప్రారంభం కాగానే బట్టీలన్నీ మూతపడ్డాయి. అవసరానికి సరిపడా ఇటుక తయారు చేసి నిల్వ ఉంటారు. చిన్న బట్టీలైతే నాలుగైదు లక్షలు, పెద్దబట్టీలైతే 10 లక్షల ఇటుకల వరకు నిల్వ పెట్టారు. బ్యాంకులు, ప్రైవేటు ఫైనాన్స్‌లు, బంగారం తాకట్లు ఇలా ఎక్కడ వీలుంటే అక్కడ అప్పులు తెచ్చి మరీ పెట్టుబడులు పెట్టారు. నాలుగు మాసాలుగా ఇటుకల విక్రయాలు లేవు. ప్రభుత్వం కేటాయించే గృహ నిర్మాణాలకు పెద్ద ఎత్తున తమ సరుకు కొనుగోలు చేస్తారని వ్యాపారులు భావించారు. గృహ నిర్మాణాలపై నూతన ప్రభుత్వం కూడా ఎటువంటి ప్రకటన చేయకపోవడంతో వీరి ఆశలపై నీళ్లు చల్లినట్టయింది. ప్రభుత్వ ఇళ్లు కాకపోతే ప్రైవేటుగా నిర్మించుకునే వారైనా శ్రావణంలో నిర్మాణాలు ప్రారంభించకపోతారా అని ఆశగా ఎదురుచూస్తున్నారు. ప్రస్తుత ఖర్చుల కోసం ఎంతో కొంత ధర తగ్గించి ఇద్దామన్నా కొనడానికి ఎవరూ ముందుకు రావడంలేదని ఉత్పత్తిదారులు వాపోతున్నారు.

ప్రభుత్వం ఇచ్చిన ఇళ్లతో పాటు ప్రైవేటు నిర్మాణాలు కూడా కుంటుపడ్డాయి. నవంబరు నుంచి మళ్లీ ఇటుక తయారీ ప్రాంభమవుతుంది. ఈ లోగా ఉన్న నిల్వలు ఖాళీ చేయాల్సి ఉంటుంది. ఇదిలా ఉండగా తమకు ఉత్పత్తి వ్యయం బాగా పెరిగిపోయిందని, మట్టి ధర, కూలీల ఖర్చు, బొగ్గు, ఊక ధరలు రెట్టింపు అయ్యాయని బట్టీ యజమానులు చెబుతున్నారు.

ఉపాధి హామీ నిధుల మంజూరులో జాప్యం

పక్కా ఇళ్లు నిర్మించుకునే లబ్ధిదారునికి ఆది నుంచి ఉపాధి నిధుల మంజూరులో జాప్యం జరుగుతోందని లబ్ధిదారులు వాపోతున్నారు. నిర్మాణాలను గృహ నిర్మాణ శాఖ పర్యవేక్షిస్తుంటే ఆయా నిధులను సంబంధిత శాఖ మంజూరు చేయాల్సి ఉంటుంది. వాస్తవానికి రూఫ్ లెవల్‌కి ప్రతి ఇంటికి 90 పని దినాలు ఒక్కో రోజుకు రూ.300 చొప్పున (మరుగుదొడ్డి)తో మూడు దఫాలుగా లబ్ధిదారుని ఖాతాలో జమచేయాలి. ఈ విషయంలో తీవ్రజాప్యం జరుగుతోందంటున్నారు.

తయారీ కష్టమే..



నాణ్యమైన ఇటుకలు తయారు చేసి వంద రూ.800కు విక్రయిస్తే గిట్టుబాటవుతుంది. అయినా విక్రయాలు లేవు. ముడి సరుకుల ధరలు పెరిగాయి. ఈ పరిస్థితులలో ఇటుక తయారీ కష్టంగానే ఉంది. ప్రభుత్వం బ్యాంకుల ద్వారా నామ మాత్రపు వడ్డీకి రుణ సహాయం అందించాలి.

– **ముతగాల వేణు**, బట్టీ యజమాని, అనంతపల్లి

గిట్టుబాటు కావడం లేదు



2016లో వంద రూ.650కి విక్రయించాం. ఇపుడు ధరలు ఇంచుమించు అంతే ఉనాయి కానీ ముడిసరుకులు ధరలు భారీగా పెరిగాయి. లక్షలాది రూపాయలు అప్పులు తెచ్చి మరీ పెట్టుబడి పెట్టాం. ఈ ఏడాది మూఢంతో పాటు ఆషాఢం తోడైంది. విక్రయాలు లేకపోవడం వల్ల ఎదురయ్యే నష్టాన్ని ప్రభుత్వం గృహ నిర్మాణాలు ప్రారంభించడం ద్వారా పూరించుకోవచ్చు.

– **శ్రీకాకుళం విజయ్**, బట్టీ యజమాని, అనంతపల్లి

ఫిట్స్‌తో అదుపుతప్పి చెట్టును ఢీకొని..

ఇద్దరికి గాయాలు

జగ్గంపేట: మండలంలోని జె.కొత్తూరు వద్ద మోటారు సైకిల్ చెట్టుకు ఢీకొన్న ప్రమాదంలో ఇద్దరికి గాయాలయ్యాయి. జగ్గంపేట పోలీసులు అందించిన వివరాల మేరకు గంగవరం మండలం లొద్దుపాలేనికి చెందిన అనబాల మరిడయ్య, అతని కుమారుడు పోసుబాబు తమ గ్రామం నుంచి జగ్గంపేట వస్తున్నారు. ఈ నేపథ్యంలో జె.కొత్తూరు వద్దకు వచ్చే సరికి మోటార్‌సైకిల్ నడుపుతున్న పోసుబాబుకు ఫిట్స్ రావడంతో మోటార్‌సైకిల్ అదుపుతప్పి రోడ్డు పక్కన వున్న చెట్టును ఢీకొంది. ఈ ప్రమాదంలో మరిడయ్య కాలికి తీవ్రగాయాలు కాగా, పోసుబాబుకు స్వల్ప గాయాలు అయ్యాయి. వారిని జగ్గంపేట సీహెచ్‌సీకి తరలించి చికిత్స అందిస్తున్నారు.

చికిత్స పొందుతూ మహిళ మృతి

నిడదవోలు రూరల్: గ్యాస్ లీకై తీవ్రగాయాలపాలైన మహిళ చికిత్స పొందుతూ బుధవారం మృతి చెందినట్లు సమిశ్రగూడెం ఎస్సై రమేష్ తెలిపారు. పోలీసుల వివరాల ప్రకారం నిడదవోలు మండలం కంసాలిపాలెం గ్రామానికి చెందిన మలిశెట్టి పద్మావతి (43) వంట చేస్తుండగా ఈనెల పదో తేదీన ప్రమాదవశాత్తూ గ్యాస్ లీకై తీవ్ర గాయాల పాలైంది. దీంతో పద్మావతిని నిడదవోలులోని ఒక ప్రైవేటు ఆసుపత్రికి తరలించి చికిత్స అందిస్తుండగా మృతి చెందినట్లు పోలీసులు తెలిపారు. పద్మావతికి భర్త వెంకటరమణ, ఇద్దరు పిల్లలున్నారు. ఈ ఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఎస్సై రమేష్ పేర్కొన్నారు.

క్రీడాస్ఫూర్తితో రాణించాలి



పోటీల్లో విజేతగా నిలిచిన కాకినాడ జట్టు



డీఎస్‌డీఓ శ్రీనివాస్ కుమార్‌ను సత్కరిస్తున్న మోడ్రన్ పెంటాథ్లాన్ సంఘం సభ్యులు

- మోడ్రన్ పెంటాథ్లాన్ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు వెంకటేశ్వరరావు
- ముగిసిన రాష్ట్రస్థాయి పోటీలు
- చాంపియన్లుగా నిలిచిన కాకినాడ
- రెండు, మూడు స్థానాల్లో విశాఖ, గుంటూరు జట్లు

నాగమల్లితోట జంక్షన్ (కాకినాడ సిటీ): కాకినాడ జిల్లా మోడ్రన్ పెంటాథ్లాన్ సంఘం ఆధ్వర్యంలో డీఎస్ఏ మైదానంలో రెండు రోజులుగా జరుగుతున్న రాష్ట్రస్థాయి 8వ మోడ్రన్ పెంటాథ్లాన్, ట్రయాథ్లాన్, బయోథ్లాన్ పోటీలు బుధవారంతో ముగిశాయి. రెండో రోజు ఆదివారం బయాథ్లాన్‌లో పోటీలు జరిగాయి. రెండు విభాగాల్లో విజేతలకు ముఖ్య అతిథులు మోడ్రన్ పెంటాథ్లాన్ సంఘ రాష్ట్ర అధ్యక్షుడు చప్పిడి వెంకటేశ్వరరావు, డీఎస్‌డీఓ బి.శ్రీనివాస్ కుమార్, గౌరవ అతిథి, లయన్స్ క్లబ్ జిల్లా గవర్నర్ శ్రీనివాసరావు మెడల్స్, సర్టిఫికెట్లు అందజేశారు. రాష్ట్ర అధ్యక్షుడు చప్పిడి వెంకటేశ్వరరావు మాట్లాడుతూ ఆటల్లో గెలుపు ఓటములు సహజమని క్రీడాస్ఫూర్తిని అలవర్చుకుని క్రీడల్లో రాణించాలన్నారు. ఆగస్టు నెలలో జరిగే జాతీయ స్థాయి పోటీల్లో రాణించి జిల్లాకు మంచి పేరు తేవాలన్నారు. డీఎస్‌డీఓ బి.శ్రీనివాస్ కుమార్ మాట్లాడుతూ మోడ్రన్ పెంటాథ్లాన్ పోటీలు చాలా కష్టం అని ఇప్పుడిప్పుడే ఈ క్రీడకు ప్రాచుర్యం పెరుగుతోందన్నారు. రాష్ట్రస్థాయిలో విజేతలుగా నిలిచిన కాకినాడ జట్టుకు శుభాకాంక్షలు తెలిపారు. ఈ పోటీల్లో కాకినాడ క్రీడాకారులు అన్ని విభాగాల్లో 25 మెడళ్లు సాధించారు. ద్వితీయస్థానంలో విశాఖ, తృతీయ స్థానంలో గుంటూరు జట్లు నిలిచాయి. ఈ కార్యక్రమంలో డీఎస్ఏ స్విమ్మింగ్ కోచ్ అప్పలనాయుడు, ఎస్‌జీఎఫ్ఐ జిల్లా కార్యదర్శి బీవీపీఎస్ ప్రసాద్, ఉపేంద్రనాథ్, గోవిందరాజు తదితరులు పాల్గొన్నారు. మోడ్రన్ పెంటాథ్లాన్ సంఘం తరఫున డీఎస్‌డీఓ బి.శ్రీనివాస్ కుమార్‌ను సంఘ రాష్ట్ర అధ్యక్షుడు చప్పిడి వెంకటేశ్వరరావు తదితరులు సత్కరించారు.

సంఘ సేవలో బాలలు

ఉప్పలగుప్తం: నేటి బాలలే రేపటి పౌరులు. అటువంటి బాలలను తీర్చిదిద్దాల్సింది పోయి పసి చేతులతో కట్టెలు కొట్టిస్తుంటే నిజంగా బాధపడాల్సిన విషయమే. మండలంలోని భీమనపల్లిలో సాంఘిక సంక్షేమ బాలుర వసతి గృహంలో బాలుర పరిస్థితి ఇది. బుధవారం సెలవు దినం కావటంతో సిబ్బంది వసతి గృహం పరిసర ప్రాంతాల్లోని చెట్ల కొమ్మలను నరికించడం, ఆవరణను శుభ్రం చేయిస్తున్నారు. వసతిగృహం వార్డెన్ ప్రవీణ్‌కుమార్‌ను ఈ విషయమై ప్రశ్నిస్తే ఆవరణలో చెత్త పెరగడంతో శుభ్రం చేయిస్తున్నాని వివరించారు.



భీమనపల్లి వసతి గృహంలో చెట్లు నరుకుతూ, శుభ్రం చేస్తున్న విద్యార్థులు

దెందులూరికి ముస్లింల సత్కారం



ప్రసాద్‌ను సత్కరిస్తున్న ముస్లిం సంఘ నాయకులు గౌస్, ఖాజాబాబు

కొత్తపేట: స్థానిక బ్రాహ్మణ సంఘం అధ్యక్షుడు దెందులూరి జగదీశ్వరప్రసాద్‌ను ముస్లింలు ఘనంగా సత్కరించారు. ఇటీవల నిర్వహించిన బ్రాహ్మణ సంఘం నూతన కార్యవర్గ ఎన్నికల్లో మాజీ ఎమ్మెల్యే దెందులూరి భానుతిలకం కుమారుడు, ఎస్‌బీఐ విశ్రాంత ఏజీఎం దెందులూరి జగదీశ్వరప్రసాద్‌ను ఏకగ్రీవంగా ఎన్నుకున్న విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో ముస్లింలకు ప్రధానమైన మొహర్రం కార్యక్రమంలో భాగంగా బుధవారం రాత్రి కమ్మిరెడ్డిపాలెం జామియా మసీదులో మండల ముస్లిం సంఘ నాయకుడు షేక్ గౌస్ ఆధ్వర్యంలో ప్రసాద్‌ను ఘనంగా సత్కరించారు. గౌస్ మాట్లాడుతూ కొత్తపేటలో హిందూ, ముస్లిం, క్రైస్తవ మతాలకు అతీతంగా అందరూ అనేక సందర్భాల్లో ఐక్యతగా ముందుకు వెళుతున్నామన్నారు. ముఖ్యంగా మాజీ ఎమ్మెల్యే కుమారుడిగా, ఎస్‌బీఐ ఏజీఎం స్థాయి వ్యక్తి అయినా తనతో కలిసి దర్గాలకు రావడం, నన్ను హిందూ దేవాలయాలకు తీసుకువెళ్తున్నారన్నారు. అటువంటి గొప్ప వ్యక్తి బ్రాహ్మణ సంఘానికి అధ్యక్షుడు కావడంతో ముస్లింల తరఫున అభినందిస్తూ సత్కరించడం మా అదృష్టంగా భావిస్తున్నామన్నారు. ఈ సందర్భంగా తన ప్రాణ స్నేహితుడు గౌస్‌కు దెందులూరి కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో మసీదు, షాదీఖానా కమిటీ అధ్యక్షుడు షేక్ కాజాబాబు, మసీదు ఇమామ్ ఇంతియాస్ అహ్మద్, కోనసీమ జనవిజ్ఞాన వేదిక కార్యదర్శి గౌస్ మొహిద్దీన్ తదితరులు పాల్గొన్నారు.

ప్రేమ పేరుతో వంచన

- బాలికను లోబరుచుకున్న యువకుడి అరెస్టు
- సహకరించిన అతడి స్నేహితుడిని సైతం..
- పలు సెక్షన్లపై కేసు నమోదు చేసిన పోలీసులు

రాజమహేంద్రవరం రూరల్: ప్రేమ పేరుతో బాలికను మోసగించడమే కాకుండా స్నేహితుని సహకారంతో ఆమెను ఇంటికి తీసుకువెళ్లి వంచించి అనంతరం ఆమె ఇంటికి సమీపంలో వదలి వెళ్లిపోయాడు. ఆమె పరిస్థితిని గమనించిన తల్లిదండ్రులు నిలదీయడంతో అసలు విషయం తెలుసుకుని స్థానిక టూ టౌన్ పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. కేసు వివరాలను రాజమహేంద్రవరం సౌత్ జోన్ డీఎస్పీ ఎం.అంబికాప్రసాద్ బుధవారం రాత్రి వెల్లడించారు. బొమ్మూరు పోలీస్ స్టేషన్ పరిధిలో నివాసిస్తున్న ఓ కుటుంబంలోని 15 ఏళ్ల బాలిక కొన్ని నెలలుగా వేమగిరి గ్రామానికి చెందిన 24 ఏళ్ల తూము దుర్గా ముత్యాలరావు (ముత్యాలు)తో సన్నిహితంగా మెలుగుతూ ఇన్‌స్టాగామ్ ద్వారా మెసేజ్‌లు పంపుకొనేవారు. ఈ క్రమంలో తనను ప్రేమిస్తున్నానని, బయటకు వెళ్దామని ఫోన్ చేశాడు. దీంతో ఆమె ఈనెల 15వ తేదీన స్కూల్‌కి వెళ్తానని చెప్పి రాజమహేంద్రవరం శ్యామలా సెంటర్‌కు వచ్చింది. అక్కడకు ముత్యాలరావు తన స్నేహితుడైన 22 ఏళ్ల గుత్తుల వీరబ్రహ్మం ఎలియాస్ వీరబాబుతో కలిసి వచ్చి మోటారు సైకిల్‌పై వేమగిరిలోని తన ఇంటికి తీసుకువెళ్లారు. అక్కడ వారిని దించి వీరబ్రహ్మం వెళ్లిపోయాడు. అనంతరం మాయమాటలు చెప్పి పెళ్లి చేసుకుంటానని నమ్మించి లొంగదీసుకున్నాడు. అనంతరం సాయంత్రం ఆమెను వారింటి దగ్గర వదిలి వెళ్లిపోయాడు. 16వ తేదీన బాలిక ప్రవర్తనపై అనుమానం వచ్చిన తల్లి ప్రశ్నించడంతో జరిగిన విషయాన్ని ఆమె తల్లిదండ్రులకు చెప్పింది. ఈ ఘటనపై బుధవారం సాయంత్రం తల్లిదండ్రులు రెండవ పట్టణ పోలీస్ స్టేషన్లో ఫిర్యాదు చేశారు. ఈ మేరకు పోలీసులు కిడ్నాప్, మానభంగం, పోక్సో కేసులు నమోదు చేశారు. సౌత్ జోన్ డీఎస్పీ ఎం.అంబికా ప్రసాద్ నేతృత్వంలో ఇన్స్పెక్టర్ వి.శ్రీనివాస్ కేసు దర్యాప్తు చేస్తున్నారు. ఎస్పీ డి.నరసింహ కిశోర్ వెంటనే నిందితులపై చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. కేసు నమోదు చేసిన కొద్ది గంటల్లోనే ప్రధాన నిందితుడు ముత్యాలరావును, మోటార్ సైకిల్‌పై అతనితో కలిసి బాలికను తీసుకువెళ్లడంలో సహకరించిన గుత్తుల వీరబ్రహ్మం లను ఇన్స్పెక్టర్ శ్రీనివాస్ అరెస్ట్ చేశారు. వారి నుంచి సెల్‌ఫోన్, మోటర్‌సైకిల్‌ను స్వాధీనం చేసుకున్నారు. దుర్గా ముత్యాలరావు 2021 సంవత్సరంలో రాజానగరం పోలీస్‌స్టేషన్ పరిధిలో ఒక హత్యానేరం కేసులో అరెస్టై జైలుకు వెళ్లి బెయిల్‌పై బయటకు వచ్చాడన్నారు. అంతే కాకుండా అతడిపై రౌడీషీట్ కూడా ఉందని పోలీసులు తెలిపారు.

కావుకేకతో కాక పుట్టించి..!



తాటిపాక సెంటర్‌లో కాకిని తాడుతో బంధించిన చికెన్ దుకాణం యజమాని



కట్టేసిన కాకి కోసం ఉద్యమం చేపట్టిన సైన్యం

- బంధించిన కాకిని విడిపించుకున్న కాకి సైన్యం
- కాకిగోల భరించలేక వదిలేసిన దుకాణదారు
- మనిషికన్నా ఆ జాతే నయమనిపించిన వైనం

రాజోలు: రోడ్డుపైన ప్రమాదానికి గురైన మనిషి గాయపడితే బాబోయ్ మాకెందుకులే అని వదిలేసే మనుషులు కాకులను చూసి బుద్ధి తెచ్చుకోవాలి. బుధవారం తాటిపాక మార్కెట్‌లో జరిగిన సంఘటన ఇందుకు రుజువు. మార్కెట్ సెంటరులో ఒక చికెన్ దుకాణం వద్ద ప్రతి రోజు కాకి వచ్చి చికెన్‌షాపులోని వ్యర్థాలతో పాటు, చికెన్ ముక్కలను ఎత్తుకుపోతూ ఉంటుంది. దీంతో దుకాణ యజమాని కాకికి వల పన్ని పట్టుకుని దానిని తన షాపు వద్ద బంధించాడు. కాకి విడిపించుకునేందుకు విఫలయత్నం చేసింది. దీంతో తన మిత్రబృందానికి కావు..కావుమని కేకలేస్తూ తన భాషలో కబురంపింది. క్షణం ఆలస్యం చేయకుండా వందలాది కాకులు అక్కడకు చేరి కకావికలం చేసినంత గోల పెట్టాయి. దీంతో చికెన్ షాపు యజమానితో పాటు చుట్టుపక్కల దుకాణాల వారు, మార్కెట్‌లోకి వచ్చిన వారి చెవులు గింగిర్లు పుట్టించాయి. ఎవరైన బంధించిన కాకి వద్దకు వెళ్తే వారి తలపై తంతూ వాటి గోళ్ల వాడి చూపించాయి. ఈ కాకులన్నీ కలసికట్టుగా చేసిన ఉద్యమానికి చికెన్ షాపు యజమాని దిగివచ్చి ఇంకా భీష్మిస్తే తన తాట తీస్తాయని గ్రహించి చేసేదేమీ లేక తాను బంధించిన కాకిని వదిలిపెట్టేశాడు. దీంతో ఉద్యమాన్ని విరమించిన కాకి సైన్యం అదే కావురింతలతో ఆకాశ వీధిలో దూసుకుపోయింది.

ఈ విషయమై స్థానిక ఉపాధ్యాయుడు అడబాల కాశీ విశ్వేశ్వరరావు మాట్లాడుతూ మిగిలిన పక్షుల కంటే కాకి జీవన విధానం చాలా విభిన్నంగా ఉంటుందని వివరించారు. కాకుల పునరుత్పత్తి చాలా రహస్యంగా ఉంటుందని, గుడ్లు కూడా ఎవరూ చూడని ప్రదేశాలను ఎంచుకుని పెట్టి పిల్లల్ని చేసి కాపాడుకుంటుయన్నారు. చాలా చోట్లు విద్యుత్ స్తంభాలపై కాకులు షాక్ కొట్టి చనిపోతే వందలాది కాకులు అక్కడకు చేరి తమ సంఘీభావాన్ని తెలియజేస్తాయన్నారు. కాకులను చూసి మనిషి అనేక విషయాలను నేర్చుకున్నాడని, అలాగే పురాణాల్లో కూడా కాకికి ఎంతో విశిష్టత ఉందన్నారు. చనిపోయిన తన పూర్వీకులను కాకుల్లో చూసుకుంటూ ఎవరైనా చనిపోతే పిండప్రదానాల్లో వాటికోసం ఎదురు చూసేంత ప్రాధాన్యం ఇచ్చారన్నారు.

మార్షల్ ఆర్ట్స్ పోటీలకు ఆశ్రమ్ విద్యార్థులు

మండపేట: హైదరాబాద్‌లో ఈ నెల 21న నిర్వహించే ఇంటర్నేషనల్ కరాటే, తైక్వాండో పోటీలకు పట్టణంలోని ఆశ్రమ్ పాఠశాల విదార్థులు ఎంపికయ్యారని మదర్ థెరిస్సా స్పోర్ట్స్ అండ్ సెల్ఫ్ డిఫెన్స్ అకాడమీ ఫౌండర్ టి.అబ్బులు తెలిపారు. బుధవారం ఆయన మీడియాతో మాట్లాడుతూ హైదరాబాద్‌లో కోట్ల విజయభాస్కరరెడ్డి ఇండోర్ స్టేడియంలో ఈ నెల 21న కరాటే గ్రాండ్ మాస్టర్ కన్నన గౌడ్ ఆధ్వర్యంలో ఇంటర్నేషనల్ కరాటే, తైక్వాండో, కుంగ్-ఫూ పోటీలకు పట్టణంలోని ఈ పాఠశాల విద్యార్థులు ఎంపికయ్యారన్నారు. సబ్ జూనియర్స్ వెయిట్ కేటగిరి 32, 34, 36, 40, 60 కేజీల విభాగాల్లో తరుణ్ ప్రకాశ్ రెడ్డి, షేక్ లాల్‌షాహిద్, కోణాల తేజరెడ్డి, తేతల నేహ శ్రీరెడ్డి, ద్వారంపూడి జాగృతి, షేక్ ఖలీద్‌హుస్సేన్ ఎంపికైనట్టు ఆయన తెలిపారు.